

యాదగిరిగుట్టలో పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

## 'మహేందరన్న' పాటల సీడీ ఆవిష్కరణ

యాదగిరిగుట్ట, మే5 : మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆలేరు నియోజకవర్గానికి చెందిన గొంగిడి యువసేన సమర్పణలో 'మహేందరన్న దారిలో' ఆడియో సీడీని రూపొందించారు. బైరపాక స్వామి రచించిన పాటలకు భిక్షపతి సంగీతం వహించగా పులియాల నరేశ్ స్వర కల్పన చేశారు. ఈ పాటల సీడీని సోమవారం యాదగిరి గుట్టలో మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా గొంగిడి యువసేన పాటల సీడీని రూపొందించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ గడ్డమీది రవీందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ సర్పంచ్ కసావు శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి, నాయకులు ముక్యర్ల సతీశ్ యాదవ్, మాటూరి బాలరాజు, అంకం నర్సింహ, ఆరె శ్రీధర్, బీర్ల మహేశ్, గుణగంటి బాబురావు, రేపాక స్వామి, కల్వకొలను సతీశ్‌భట్ పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



మోత్కూరులో ఎంపీఓ జనార్దన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పేదలు

మోత్కూరు, మే 5 : అర్హులైన పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని పలు గ్రామాలకు చెందిన పేదలు కోరారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అధికార పార్టీకి చెందిన కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారని, గ్రామంలో నివాసం ఉండి కూలీ పనులు చేసుకొని బతుకుతున్న వారికి ఇండ్లు మంజూరు చేయలేదని తెలిపారు. ఇప్పుడు ఎంపిక చేసిన అనర్హుల జాబితాను రద్దు చేసి అధికారులు నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. అనంతరం ఎంపీఓ జనార్దన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పొడిచేడు, సదర్శాపురం, మోత్కూరు గ్రామాలకు చెందిన పేదలు జిట్ట గౌతమ్, ఉదయలక్ష్మి, దివ్య, చందు, సోమరాజు, మల్లయ్య, నగేశ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు



వలిగొండ శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

వలిగొండ, మే5: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ 2025 వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల కోసం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల దృష్ట్యా వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులను అడ్వాన్స్ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి కళాశాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు, కళాశాలకు వచ్చే అవకాశంలేని విద్యార్థుల కోసం ఆన్‌లైన్‌లో తరగతులకు హాజరయ్యే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రత్యేక తరగతులను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి భీంసింగ్ సోమవారం పర్యవేక్షించి ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం



చౌటుప్పల్‌లో జెండాను ఎగురవేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

చౌటుప్పల్, మే 5 : మండల కేంద్రంలో చౌటుప్పల్ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఎదుట మేడే జెండా కూడా ఆవిష్కరించారు. ప్రతి నెలా 5న సెలవుదినం పురస్కరించుకొని కార్మికులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కార్మికుల సమస్యలను పలువురు చర్చించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు మలిగె దశరథ, లందగిరి వెంకటేశం, ఎర్నం శ్రీనివాస్, గుండెమోని రాములు, బ్రహ్మయ్య, మండారి మార్క్, కానుగు బాలరాజు పాల్గొన్నారు.

## అందాల పోటీలను విరమించుకోవాలి : ఐద్వా



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ

భువనగిరి అర్బన్, మే 5 : రాష్ట్ర ప్రభుత్వం మే 7 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 72వ మిస్ వరల్డ్ పోటీలను విరమించుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ అన్నారు. భువనగిరిలో సోమవారం వివిధ మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో రోజూ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా పాలకులకు పట్టింపులేదని విమర్శించారు. అందాల పోటీలకు సుమారు రూ.250కోట్లు ఖర్చు అవుతుందని, వీటిని మహిళా సంక్షేమానికి ఖర్చు చేస్తే మహిళల అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ మహిళా సంఘాల సభ్యులు రాచకొండ సీత, బండి జంగమ్మ, సబిత పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న ప్రపంచ అందాల పోటీలను నిలిపివేయాలని, మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) పట్టణ కార్యదర్శి పగడాల శివ అన్నారు. భూదాన్‌పోచంపల్లిలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రేవంత్ సర్కారు విఫలమైందని అన్నారు.

## ఓబీసీ మహిళా సింహగర్జన సభకు రావాలి

- మందకృష్ణ మాదిగకు ఆహ్వానం



మందకృష్ణకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి

భువనగిరి అర్బన్, మే 5 : ఓబీసీ మహిళా సింహ గర్జన సభను త్వరలో జరుపుతామని, ఈ సభకు మద్దతుగా రావాలని కోరుతూ మంద కృష్ణమాదిగ, బీసీ సంఘాల వ్యవస్థాపకుడు ఆర్.కిష్టయ్యకు వేర్వేరుగా ఓబీసీ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అసెంబ్లీలో, పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ 33శాతం చేయాలని డిమాండ్‌తో మహిళా సింహగర్జన సభ ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. ఈ సభకు మహిళలు బాధ్యతతో రావాలని పిలుపునిచ్చారు. ఓబీసీ సెంట్రల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కదూరి అచ్చయ్య, నాయకులు ఎ.సువర్ణ, విజయలక్ష్మి, సాయిలు, వివేక్, రాజేశ్ పాల్గొన్నారు.

## కామ్రేడ్ రామారావుకు నివాళి



ఆలేరు టౌన్, మే 5 : ఆలేరులోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో కామ్రేడ్ రామారావు 6వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు జిల్లా కార్యదర్శి ఆర్. జనార్దన్ తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు. తన ఆట పాటలతో ప్రజలను చైతన్య పర్చారని, విప్లవ సాంస్కృతిక ఉద్యమ అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్ష, డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, నాయకులు కలెపు అడవయ్య, బేజాడి కుమార్, గడ్డం నాగరాజు, పద్మ సుదర్శన్, కట్టా సమర సింహారెడ్డి, సిద్దులు, ఉదయ్, మంకయ్య పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ హన్మంతరావు



ఆత్మకూరు(ఎం) : సర్వేపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ హన్మంతరావు

ఆత్మకూరు(ఎం), మే5 : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హన్మంతరావు అన్నారు. భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలో ఆత్మకూరు(ఎం) మండలాన్ని రెవెన్యూ సదస్సులకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. ఇందులో భాగంగా మండలంలో సోమవారం సర్వేపల్లి, రాయిపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కోర్టు కేసులతో పాటు భూ వివాదాలు లేని భూ సమస్యలను సదస్సుల్లోనే తక్షణమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. రైతులు తమ భూ సమస్యలను దరఖాస్తు ఫారాలలో వివరిస్తూ రాసిన దరఖాస్తులను సదస్సుల్లోనే అందివ్వాలని తెలిపారు. వివాదాలు లేని భూసమస్యలను గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టి పరిష్కరించాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే జూన్ 2లోపు సంబంధిత అధికారులు విచారణ చేపట్టి భూ సమస్యలను పరిష్కరించి సంబంధిత రైతులకు న్యాయం చేస్తారని తెలిపారు. ఈ నెల 15వరకు మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించనున్న సదస్సులను విజయవంతం చేయాలని కోరారు. మొదటి రోజు సదస్సులో రాయిపల్లిలో 15, సర్వేపల్లిలో 5 దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఆత్మకూరు, వలిగొండ మండలాల తాసీల్దార్లు లావణ్య, శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఆర్ఐ మల్లిఖార్జున్‌రావు, పాండు, సర్వేయర్ స్వప్న పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

భువనగిరి కలెక్టరేట్ : ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై అధికారులు అలసత్వం వహించొద్దన్నారు. ప్రజావాణిలో భాగంగా 48 అర్జీలను స్వీకరించామని, అందులో రెవెన్యూశాఖకు-29, జిల్లా పంచాయతీ శాఖకు-8, సర్వే ల్యాండ్స్‌కు-3, హౌసింగ్‌కు-2, ఆర్‌టీసీకి-2, లేబర్, విద్య శాఖ, ఇంటర్మీడియట్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలకు ఒక్కొకటి చొప్పున ఫిర్యాదులు అందాయని తెలపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 'తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'



కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యమకారుల నాయకులు

వలిగొండ, మే5: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేపీసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ హనుమంతరావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టోఫర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారుల ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు, ఉచిత బస్‌పాస్, రూ.25 వేల పింఛన్ ఇవ్వడంతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల జేపీసీ నాయకులు కొండపురం శ్రీనివాస్, అంతటి రవి, మంటి లింగయ్య, సంగిశెట్టి జనార్దన్, గడ్డమీది పరశురాం, గంధమల్ల శ్రీనివాస్, చేర్యాల సుగుణమ్మ, గంధమల్ల గోపాల్, పబ్బు స్వామి, కానుకుంట్ల పుష్ప తదితరులు పాల్గొన్నారు.

### మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ఆలేరు రూరల్, మే5 : మండలంలోని గొలనుకొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనిచేస్తున్న కూలీలు, రైతులకు వేసవిని పురస్కరించుకొని పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలి



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న మండల వైద్యాధికారిణి యామినీశృతి

భువనగిరి కలెక్టరేట్, మే 5 : పల్లె దవాఖానల్లో వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని మండల వైద్యాధికారిణి యామినీ శృతి సూచించారు. మండలంలోని అనంతారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆమె వెంట డాక్టర్ కొండ మురళీమోహన్, వైద్యసిబ్బంది విజయ, రేణుక, వసుధ, సురేశ్‌కుమార్, రమాదేవి, ఆశ కార్యకర్తలు శోభ, లింగలక్ష్మి, కల్పన, విజయ, అరుణ ఉన్నారు.

### ఆటోబోల్తా..ఏడుగురికి గాయాలు

రామన్నపేట, మే5: అదుపుతప్పి ఆటో బోల్తా పడటంతో ఏడుగురికి స్వల్పగాయాలైన సంఘటన మండలంలోని దుబ్బాక గ్రామశివారులో సోమవారం చోటు చేసుకుంది. హైద్రాబాద్ రామాంతపూర్‌కు చెందిన రెండు కుటుంబాల వారు మోత్కూరు మండలం కొండగడపలో జరిగిన బొడ్రాయి పండుగకు వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. ఆటో దుబ్బాక గ్రామ శివారులోని కోళ్లఫాం వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బి జ్యోతి, వైష్ణవి, గంగమ్మ, వెంకటేశ్, కొండయ్యతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. 108 లో రామన్నపేట దవాఖానకు తీసుకురాగా చికిత్స అందజేశారు.

## సజావుగా పీపీటీ ప్రవేశ పరీక్ష



పీపీటీ ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

భువనగిరి అర్బన్, మే 5 : ఉచిత రెసిడెన్షియల్ విద్య కోసం పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం భువనగిరి పట్టణంలోని తిరందాస్ గోపి విజ్ఞాన భవనంలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముక్కెర్ల యాదయ్య, మెతుకు సైదులు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా రాష్ట్రంలోని అనాధ, పాక్షిక అనాధ, నిరుపేద విద్యార్థులకు ఉచితంగా, అన్ని తరగతులకు నాణ్యమైన రెసిడెన్సియల్ విద్యను ఈ ట్రస్ట్ ద్వారా అందించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాజరయ్యారని, వారం రోజుల్లో పరీక్షకు సంబంధించిన ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరీక్ష పరిశీలకులు వి.రమ్య, జిల్లా కార్యదర్శి దొడ్డి స్వామి, ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.కరుణాకర్, సభ్యులు గుజ్జ బాలయ్య, జిల్లా కమిటీ సభ్యులు కంచుగట్ల వెంకన్న, ఐలేని సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ర్యాంప్ వే లేక అవస్థలు



రాజాపేట తాసీల్దార్ కార్యాలయంలో ర్యాంప్ వే లేక వీల్ చైర్‌లో వృద్ధుడిని ఎత్తుకొని తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

రాజాపేట, మే 5 : స్థానిక తాసీల్దార్ కార్యాలయానికి ర్యాంప్ వే లేక వృద్ధులు వికలాంగులకు అవస్థలు తప్పడం లేదు. కార్యాలయానికి వచ్చే వారి కోసం వీల్ చైర్‌తో పాటు ర్యాంప్ వే నిర్మించడం కార్యాలయ అధికారులు మరిచారు. దాంతో నడువలేని పరిస్థితిలో ఉన్న వృద్ధులను రిజిస్ట్రేషన్ కోసం వస్తే నలుగురు కుటుంబ సభ్యులు ఎత్తుకొని పోవాల్సి వస్తున్నది. కార్యాలయానికి ర్యాంప్ వే నిర్మించి వృద్ధులు, వికలాంగుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

### బీఆర్‌ఎస్ నాయకుడు చుంచు నర్సయ్య మృతి



ఆత్మకూరు(ఎం), మే5 : మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చుంచు నర్సయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. నర్సయ్య మృతి పట్ల మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్, కొరటికల్ మాజీ సర్పంచ్ సత్తయ్యగౌడ్ సంతాపం తెలిపారు.

### యువకుడి అదృశ్యం



పిట్టల సందీప్

రామన్నపేట, మే5 : మండల కేంద్రానికి చెందిన పిట్టల మత్స్యగిరి అదృశ్యమయ్యాడు. ఇతను చౌటుప్పల్ మండలంలోని లింగోజిగూడెంలోని పెంట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఏప్రిల్ 28న ఉదయం 7గంటలకు ఇంటి నుంచి డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బయల్దేరాడు. ఆరోజు నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్చాఫ్ రావడంతో బంధువుల, స్నేహితుల ఇంటివద్ద వాకబు చేశారు. ఆచూకీ తెలియక పోవడంతో భార్య పిట్టల దివ్య సోమవారం ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మల్లయ్య కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

### పిడుగు పాటుకు బర్రె మృతి

మోటకొండూర్, మే 5: పిడుగుపాటుకు గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపడి మండల కేంద్రంలోని రైతు పీసరి తిరుమల్‌రెడ్డికి చెందిన బర్రె మృతి చెందింది. దాని విలువ సుమారు లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు తిరుమల్‌రెడ్డి కోరారు.

## 7 నుంచి ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్

భువనగిరి అర్బన్, మే 5 : నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అండర్-14, అండర్-16, అండర్-19 బాలబాలికలకు నిర్వహించే ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని క్యాంప్ ఇన్‌చార్జిలు రావుల సతీశ్, ఆబోతుల కేతన్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఈ 7 నుంచి జూన్ 7 వరకు ఉంటుందని, ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ నిర్వాహణకు నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సయ్యద్ అమీనుద్దీన్ వ్యవహరిస్తారని, అసక్తి గల క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం 8341313449 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## నేటి నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

భూదాన్‌పోచంపల్లి, మే 5 : ఈ నెల 6 నుంచి 12 వరకు మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని శైలజ సోమవారం ప్రకటనలో తెలిపారు. వివిధ పంటలపై అవగాహన ఉంటుందని పేర్కొన్నారు. 6న పోచంపల్లి వరి కొనుగోలు కేంద్రం వద్ద, 7న పిలాయిపల్లి, 8న రామలింగంపల్లి, 9న భీమనపల్లి, 13న శివారెడ్డిగూడెం, 14న అలీనగర్, 15న గౌస్‌కొండ, 16న జలాల్‌పూర్, 20న దంతూర్, 21న మెహర్‌నగర్, జూలూరు, 22 దోతిగూడం, 27న వంకమామిడి, 28న హైదర్‌పూర్, కప్రాయపల్లి, 29న ముక్తాపూర్, జూన్ 3న ధర్మారెడ్డిపల్లి, 4న జిబ్లక్‌పల్లి, పెద్దరావులపల్లి, 5న జగత్‌పల్లి, 10న కనుముక్కుల, 11న ఇంద్రియాల, 12న దేశ్‌ముఖి, గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

### వ్యవసాయ సదస్సును వినియోగించుకోవాలి

బొమ్మలరామారం : మండలంలోని హాజీపూర్, రామలింగంపల్లి గ్రామాల్లో మంగళవారం రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వ్యవసాయ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.దుర్గేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### పోచంపల్లిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూదాన్‌పోచంపల్లి, మే 5 : మున్సిపల్ పరిధిలోని రేవనపల్లి, పోచంపల్లిలో మంగళవారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 /11 కేవీ లైన్ల మరమ్మతులు, తీగలకు ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

### అక్రమ వలసదారులను పంపించాలని వినతి

భువనగిరి అర్బన్, మే 5: భువనగిరి పట్టణంలో ఉపాధి పేరుతో పలు ప్రాంతాల్లో సుమారు 5వేల మంది అక్రమ వలసదారులు మదర్సాలలో ఆశ్రయం పొందుతున్నారని, వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుని పంపించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాయ దశరథ అన్నారు. పట్టణంలోని అక్రమ వలసదారులను పంపించాలని కోరుతూ సోమవారం పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణకు పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రత్నపురం బలరాం, రాళ్లబండి కృష్ణచారి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నరాల శ్రీనివాస్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

## కురుమ కులానికి పట్టిన శని యెగ్గె మల్లేశ్



మాట్లాడుతున్న కురుమ సంఘం నాయకులు కర్రె వెంకటయ్య, పేరపు రాములు

- ఆయన గద్దె దిగే వరకూ పోరాడుతాం
- ఈ నెల 15న గుట్టలో కురుమ సంఘం సన్నాహక సమావేశం
- ఆ సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రాములు

యాదగిరిగుట్ట, మే5: గత 20 ఏండ్లుగా కురుమ కులానికి పట్టిన శనిగా మాజీ ఎమ్మెల్సీ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశ్ మారాడని, ఆయన పదవి నుంచి గద్దె దిగేవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కర్రె వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పేరపు రాములు, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధ అన్నారు. తన అనుచరులతో ఇష్టారాజ్యంగా ఓట్లేసుకుని 30 ఏండ్లుగా కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాడని, కురుమ కులస్తులను తీరని అన్యాయం చేస్తున్నాడని మండిపడ్డారు. యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. కురుమ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ఉంటూ డబ్బులు దండుకునే పనిలో ఉన్నారని ఆరోపించారు. మన్సురాబాద్‌లో కురుమ సంఘానికి చెందిన హాస్టల్ భవనాన్ని లీజుకు ఇచ్చిన డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని, హాస్టల్‌లో విద్యార్థుల వద్ద నెల ఫీజులు వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. కొమురవెల్లిలో కురుమ కులస్తులను వాడుకుని పదవులను అనుభవించారే తప్ప కులస్తులకు ఆయన చేసిందేమీ లేదని అన్నారు. యాదగిరిగుట్టలో కురుమ సంఘాన్ని చెందిన చండీశ్వర భవనంలోకి కురుమ కులస్తులకు అనుమతిలేదని చెప్పడం పట్ల తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎంతో మంది దాతల సహకారంతో భవనాన్ని నిర్మించామని, శిలాఫలకంపై కురుమ కులస్తుల ప్రజాప్రతినిధులు పేర్లు కూడా ఉన్నాయని చెప్పారు. తమ సొంత నిధులతో భవనం నిర్మించామని, కురుమ కులస్తులు ఎవరూ రావొద్దంటూ యెగ్గె మల్లేశ్ కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశ్ నిర్వాహకంతో యాదగిరిగుట్టలో కురుమ కులస్తులకు సొంత సత్రం లేకుండా పోయిందని వాపోయారు. చండీశ్వర భవనం ముమ్మాటికీ కురుమ కులస్తులకు భవనమేనని, ఎప్పటికైనా ఆ భవనాన్ని కైవసం చేసుకుంటామని తెలిపారు. ఈ నెల 15న యాదగిరిగుట్ట పట్టణంలో కురుమ సంఘం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని, పార్టీలకతీతంగా కురుమ కులస్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆలేరు పట్టణ కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గిడి శ్రీశైలం కురుమ, కురుమ సంఘం నాయకులు కొన్నె మల్లేశ్ కురుమ, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, మాజీ ఎంపీటీసీ బీర్ల మహేశ్, నాయకులు సిద్దులు, కర్రె గణేశ్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



కొల్లూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరు రూరల్, మే 5 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. సోమవారం మండలంలోని కొల్లూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యంలో తాలు, గడ్డి లేకుండా శుభ్రంగా ఉంటేనే మిల్లర్లు పెండింగ్ పెట్టకుండా దిగుమతి చేసుకుంటారని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఆయన వెంట తాసీల్దార్ అంజిరెడ్డి ఉన్నారు.

### రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

మోటకొండూర్ : మండలంలోని దిలావర్‌పూర్, ఇక్కుర్తి, మాటూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం తాసీల్దార్ నాగదివ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రికార్డులను పరిశీలించి, ధాన్యం నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పంట మార్పిడి పద్ధతితో అధిగ దిగుబడులు

- రైతు సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు



చౌటుప్పల్ రూరల్ : మాట్లాడుతున్న చౌటుప్పల్ ఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

తుర్కపల్లి, మే5 : పంట మార్పిడి పద్ధతిని పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఇందుధర్‌రెడ్డి, ప్రసూన అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతులు ఒకే రకం పంటలు వేయడం ద్వారా భూమిలో సారం నశిస్తుందన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోపాల్, యాదగిరిగుట్ట ఏడీఏ శాంతినిర్మల, ఏఓ ఉమ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్దునాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ రాంచంద్రయ్య, ఏఈఓలు పాల్గొన్నారు.

### సస్యరక్షణ చర్యలతో అధిక లాభాలు

చౌటుప్పల్ రూరల్ : రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు బద్రూనాయక్, అనిల్‌కుమార్ తెలిపారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని రైతువేదికలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలు చేయించి అందులో అనుకూల పంటలు వేయాలని సూచించారు. ఆర్‌డీఓ పల్లె శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ హరికృష్ణ, ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ప్యాక్స్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ జ్యోతి

రామన్నపేట, మే5 : విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి తమ తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులకు మంచి పేరును తీసుకురావాలని మండల విద్యాధికారి గవ్వ జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివి జిల్లాలో మొదటి ర్యాంకులు సాధించిన కాలేరు శ్రేష్ట (సీఈసీ), కాలేరు నందిని (ఎంఎల్‌టీ), కాలేరు వర్షిత (ఈటీ) విద్యార్థినులను సోమవారం ఎంఈఓ ఆమె కార్యాలయంలో శాలువాలు కప్పి సన్మానించారు. ఇతర విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ కళాశాల, పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్వంచ హరికిషన్, మెసెంజర్ నాగరాజు పాల్గొన్నారు.

## నర్సరీలో అన్ని రకాల మొక్కలను పెంచాలి

ఆత్మకూరు(ఎం), మే5 : మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను సంరక్షించి పెంచాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. మండలంలోని రాయిపల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీని సోమవారం ఆయన పరిశీలించారు. నీడనిచ్చే మొక్కలతోపాటు పండ్లు, కూరగాయలు, పూల మొక్కలను పెంచి గ్రామ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయాలని, గ్రామంలో ప్రధాన వీధుల వెంట నాటి సంరక్షించాలని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, నర్సరీ నిర్వాహకురాలు మంజుల ఉన్నారు.

## 'సర్వీసు రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలి'

చౌటుప్పల్, మే 5 : పట్టణంలో వెంటనే సర్వీసు రోడ్ల పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రోడ్లు కబ్జాకు గురై అక్రమ కట్టడాలు చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అక్రమ కట్టడాలకు పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామనగోని శంకరయ్య, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ పాల్గొన్నారు.

### ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గా కొనుగోలు చేయాలి

భూదాన్‌పోచంపల్లి, మే 5 : రైతుల ధాన్యాన్ని ఏ గ్రేడ్ ధాన్యంగా కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్ల వద్ద దిగుమతి చేసుకునే సందర్భంలో బీ గ్రేడ్ ధాన్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. మూసి పేరుతో మంచి ధాన్యాన్ని కూడా బీ గ్రేడ్ ధాన్యం మార్చుతున్నారని తెలిపారు.